# ఎనిమిదవ ప్రసంగము

ఒకప్పుడు శ్రీప్రకాశానంద స్వామివారు జామ్‌నగరునుండి పీఠడియా వెళ్ళుచుండిరి. ఇది చూచి త్ర్యంబకభాయి ఇట్లనెను— "నిత్యానందస్వామివారి దర్శనము చేయవలెనని కోరికగా నున్నది. అనుజ్ఞ ఇచ్చినచో తమతో కూడ వచ్చెదను.

స్వా॥ ప్ర॥:—ఎంతో సంతోషము. రమ్ము.

ఇరువురును పీఠడియా వెళ్ళిరి. నిత్యానందస్వామి "ఈయన ఎవరు" అని అడిగిరి.

## శాస్త్ర శ్రవణము ఔషధము.

స్వా॥ ప్ర:—వీరు జామ్‌నగరులో డా॥ వీరజీభాయి కుమారుడు. బొంబాయిలో బి. ఏ. చదువుచుండగా క్షయవ్యాధి సోకినది. వ్యాధి ముదిరిపోవుట చూచి వైద్యులు తగు జాగ్రత్త తీసికొనమని ఈయనకు సలహా ఇచ్చిరి అంతట ఈయన లక్ష్యము స్థూలశరీరము నుండి సూక్ష్మశరీరమువైపునకు మరలినది. పిదప తండ్రిని ఇట్లు అర్థించిరి:—"ఉదయమును, సాయంకాలమును వేదాంతశ్రవణము చేసిన బాగుండును." తండ్రిగారు శాస్త్రజ్ఞులను రప్పించి ఉదయసాయం కాలములయందు వీరికి వేదాంతశ్రవణమునకు ఏర్పాటు కావించిరి. గీత, ఉపనిషత్తులు, పంచదశి మొదలగు గ్రంథములను ఈయన సావధానముగా వినెను. విద్యాభ్యాసకాలమున ఆంగ్లముతో బాటు సంస్కృతమునుకూడ చదివియున్నందున వీరికి శాస్త్రాభ్యాసము కఠినముగా తోచలేదు.

త్ర్యంబకభాయితో ఇద్దరు నౌకరులుకూడ ఉండిరి. బలహీనత వలన ఆయన శరీరము తరుచు నొప్పులు పెట్టుచుండుటచే తరచు ఒడలు పట్టుటకు వారు కావలసియుండెను.

## శ్రీనిత్యానందస్వామివారి వాత్సల్యమునకు మేరలేదు.

ఆసమయమున ప్రకాశానందస్వామి మొదలగువారు నిత్యానందస్వామివారిచెంత కూర్చొనియుండిరి. సమయమైనందున భోజనమునకు పిలుపు వచ్చెను. త్ర్యంబకభాయి ఆరోగ్యము సరిగాలేనందునను, నిత్యానందస్వామివారు సాయంకాలభోజనము చేయనందునను ఇరువురును భోజనమునకు వెళ్ళలేదు. త్ర్యంబకభాయివద్ద నౌకరులు ఎవరును హాజరుగా లేరు. అంతట నిత్యానందస్వామివారే ఆయన కాళ్ళు పట్టసాగిరి. ఇది కాంచి త్ర్యంబకభాయి ఇట్లనెను:—

"బాబూ, ఇది ఏమి? నాకు ఎంత లజ్జాకరము. నాకు నరకము కలుగును."

స్వా॥ ని॥ :—"ఏమియు తప్పులేదు. నా పిల్లవాడవేకదా."

అందరు భోజనముచేసి వచ్చినతరువాత ప్రకాశానందుల వారితో త్ర్యంబకభాయి ఇట్లనెను. "చూచితిరా! స్వామివారు నా కాళ్ళు పట్టుచున్నారు. నాకు ఎంతయో బాధగా నున్నది.

## బుద్ధసమానులగు స్వామివారు.

స్వా. ప్ర.:—నీవు వారి పిల్లవాడవు. అంతే కాదు. స్వామివారు బుద్ధదేవునివంటివారు. బుద్ధదేవుడు మహాభినిష్క్రమణానంతరము త్రోవలో కనిపించిన దుఃఖితులందరికిని సేవచేసెడివాడు. పశుపక్ష్యాదులకు కూడ ఏమాత్రము బాధ కలిగినను ఆయన సహించలేక పోయెడివాడు. వాటి దుఃఖమును పోగొట్టెడివాడు.

## శ్రుతి వైవిధ్యము.

రాత్రితొమ్మిదిగంటలకు భోజనానంతరము ఎల్లరును కూర్చొని ఉండిరి. త్ర్యంబకభాయి నిత్యానందస్వామివారిని ప్రశ్నించెను:—

"ఉపనిషత్తులలో కొన్ని "శ్రుతులు ద్వైతమును బోధించున్న

ఉదా:- "ద్వా సుపర్ణా సయుజా సఖాయా", "జీవుడు ఈశ్వరుడును అను రెండు పక్షులును స్నేహితులు, కలిసియుండును. "యదా పశ్యత్యన్యమీశమ్", "ఏకాగ్రచిత్తముతో, యోగి జనదుర్లభుడును దేహాతిరిక్తుడును, ప్రపంచాతీతుడును అగు దేవుని చూచినప్పుడు శోకములన్నియు నశించును."

కాని, మరికొన్ని అద్వైతమును బోధించును. ఉదా:-"అహం బ్రహ్మాస్మి," "నేను బ్రహ్మమును." "ఆత్మానం చేద్విజానీయాత్," "ఆత్మ అను నేను చైతన్యఅపరోక్షబ్రహ్మమును అని తెలిసికొనవలెను." మొదలగునవి.

వీనిలో ఏవి నిజమని అంగీకరించవలెను?"

శ్రీనిత్యానందస్వామివారు ప్రకాశానందస్వామివారిని సమాధానము చెప్పుడని కోరిరి.

స్వా. ప్ర.:-ఈసందేహమునకు విద్వాంసులే సమాధానము చెప్పగలరు. నేను విద్వాంసుడనుకాను. కావున సరియగు సమాధానము చెప్పలేను. కాని తెలిసియున్నంతవరకు చెప్పెదను. ద్వైతబోధకములును, అద్వైతబోధకములును అగు శ్రుతులు అధికారిభేదముచే ప్రకటించబడినవి. భేదజ్ఞానము, అభేదజ్ఞానము కూడ అటులనే అధికారిభేదముచే వేరువేరుగా చెప్పబడినవి. తమ తమ యోగ్యతలను బట్టి ముముక్షువులు గ్రహించవలెను.

మనువు చెప్పెను :—

శ్రుతిద్వైధం తు యత్ర స్యాత్ తత్ర ధర్మావుభౌ స్మృతౌ ।
ఉభావపి హితౌ ధర్మౌ సమ్యగుక్తౌ మనీషిభిః॥

"శ్రుతులు రెండురకములుగా చెప్పినచోట రెండును ధర్మములే అని స్మృతి చెప్పుచున్నది. వివేకముకల మానవులు రెంటిని విచారించి రెండును హితకరమగు ధర్మములు అని తెలిపిరి."

కావున వానిలో నీకు తగినదానిని నీవు గ్రహించుము. దానినిగురించి ఎక్కువ శంకించ నవసరము లేదు.

కపిలుడు సాంఖ్యశాస్త్రమున ఇట్లు చెప్పెను :—

శ్రుతివిరోధాన్న కుతర్కాపసదః స్యాత్మలాభః ।

"శ్రుతివిరోధము నాధారముగా చేసికొని కుతర్కము చేసినచో ఆత్మలాభము కలుగదు."

ఇదేవిధముగా శ్రుతివైవిధ్యము కలచోట తర్కమునకు స్థానము నీయక తన యోగ్యతను అనుసరించి సగుణ బ్రహ్మోపాసనయో, లేక నిర్గుణబ్రహ్మోపాసనయో, భేదోపాసనయో, లేక అభేదోపానన యో దేనియందో ఒకదానియందు నిమగ్నుడవవలెను. అదియే యుక్తము.

త్ర్యంబక :—స్వరూపసాక్షాత్కారమునకు సాధన మేమి?

నిత్యానందస్వామివారు ప్రకాశానందులవారిని సమాధానము చెప్పుడని కోరిరి.

స్వా. ప్రి. :—ప్రస్తుతము అసుర, రాక్షస సంపదలే ఎక్కువగా పాలించుచున్నవి. పురుషార్థమునకు చోటులేదు. పురుషార్థము లేనిదే స్వరూపసాక్షాత్కారము జరుగదు. స్వరూపనిష్ఠకు దైవసంపద అవసరము. అది నశించి పోయినది.

స్వా. ని. :—గీతాదిశాస్త్రములయందు ఉన్నదికదా!

స్వా. ప్రి. :—గీతాది శాస్త్రములయందు ఉన్నది. కాని నేడు చావుకు సిద్ధముగా నున్నది. బ్రతికి ఉన్నట్లుకనబడుటయే లేదు. గీతాదులు అనేకులచే అనేక ప్రదేశములయందు అధ్యయనము చేయబడుచున్నవి. ఉపదేశింపబడుచును ఉన్నవి. కాని అందలి ఉపదేశములను ఆచరించువారు మాత్రము కనబడుటలేదు.

ఒక నగరములో రణఛోడ్‌జీ మందిరము కలదు. (ద్వారకానాథుడు జరాసంధునితో యుద్ధములో ఓడిపోయి పారిపోవుటనందున

సౌరాష్ట్రవాసులు ఆయనను రణఛోడ్ జీ అందురు.) దాని మహంతు ఒక వైష్ణవసాధువు. అతడు చాలధనము సంపాదించెను. ఇతర గ్రామములలో అతనికి భవనములు, మందిరములు కలవు. తాను మఠాధిపతిని అనుకొనెడివాడు. తన మఠమునకు గీతాపీఠము అని పేరు పెట్టెను. పన్నెండుమాసములు గీతాప్రవచనము చేసెడివాడు. ప్రవచన సమయమున ఆనందాశ్రువులు వెలువరించెడివాడు. ఒక జిజ్ఞాసువు ఒకనాడు వారికథ వినుటకు వచ్చెను. ప్రవచన సమయమున ఆయన ఇట్లు చెప్పెను. భగవానుడు తన శ్రీముఖమునుండి వెలువరించిన వాక్యములనే నేను నమ్మెదను. ఆచార్యులును, విద్వాంసులును వ్రాసిన టీకలును, భాష్యములును నేను నమ్మను. అవి నాకు ప్రమాణములు కావు. అంతియే కాదు. ఉపనిషత్తులు కాని, శ్రుతులు కాని నాకు ప్రమాణములు కావు. కారణమేమన, అవి అన్నియు భగవానుడు ఋషులద్వారా చెప్పించినవి. కాని గీత స్వయముగా భగవానుని ముఖపద్మ నిస్సృతము. మహాభారతమున ఇట్లున్నది:—

*గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్రవిస్తరైః ।*
*యా స్వయం పద్మనాభస్య ముఖపద్మాద్వినిస్సృతా ॥*

"గీతాధ్యయనము చేయవలెను. ఇతరశాస్త్రములను చదువుట అనవసరము. ఏలనన, గీతమాత్రమే భగవానుని ముఖపద్మమునుండి వెలువడినది."

ప్రవచనానంతరము ఆ జిజ్ఞాసువు సాధువుగారిని అడిగెను:— తమరు భగవానుడు చెప్పినమాటలను నమ్మెదనని సెలవిచ్చినారు. గీత ఆరవ అధ్యాయము 10వ శ్లోకమున అపరిగ్రహమును చెప్పినారు. "*అపరిగ్రహః*" "పరిగ్రహము పనికిరాదు." అట్టి పదార్థములను అనుభవింపరాదు అని నుడివిరి. భగవానుని ఆజ్ఞను తమరు పాటించెదరు కదా! పాటించుచో తమ వద్దయున్న బండ్లు, వాహన

ములు, భూములు, ధనము, వస్తువులు ఎందుకు ఉంచుకొన్నారు. 12వ అధ్యాయము 8వ శ్లోకములో "అనికేతః" అని ఉన్నదికదా! తమకు పెద్దపెద్ద మేడలు ఉన్నవే! 6వ అధ్యాయము 8వ శ్లోకములో "సమలోష్టాశ్మ కాఞ్చనః" అని ఉన్నది. బంగారము, రాయి, మన్ను సమానముగా చూడవలెను. తమరు,చూడగా బంగారము చాల నిలవ చేసియున్నారు. ఇవి అన్నియు భగవానుని ఆజ్ఞకు వ్యతిరేకములు. మీరుకూడ మావంటివారే అనుకొనవచ్చునా?

సాధువు :-తనదగ్గర గోచీగుడ్డ ఉన్నను మమత్వము ఉన్నచో అది బంధనము. కాని లక్షలకొలది ద్రవ్యము ఉన్నను మమత్వము లేనిచో బంధనము కాదు.

జిజ్ఞాస:—మమత్వము లేనిదే వస్తుసంగ్రహము ఎట్లు జరుగును? వసిష్ఠమహర్షి సమర్థుడైనను కుటీరములో నివసించెడివాడు. ధనము సంగతి అటుంచండి. రెండవరోజుకు కావలసిన బియ్యము కూడ ఆయన కూడబెట్టెడివాడు కాదు. తమరు భగవద్వాక్యములను అంగీకరింతునని చెప్పుచున్నారు.

శిష్యవర్గము:— సద్గురువులు సాక్షాత్తు కృష్ణస్వరూపులు. వారికి గీత ప్రమాణము కానక్కరలేదు.

జిజ్ఞాసు:- సద్గురువులకు గీత ప్రమాణము కాకపోవచ్చును. మీరు అయినా గీతను అంగీకరించుచున్నారా?

శిష్య:-మాసద్గురువులు మాకు కృష్ణభగవానునివంటివారు. వారి వచనముల నతిక్రమించి మేము గీతనుమాత్రము ఎట్లు అనుసరింతుము?

జిజ్ఞాసు:-"పురాణములయందు ఇటులనే చెప్పబడినది. కలియుగమున శ్రుతి, స్మృతి, పురాణాదులను ప్రమాణముగా నంగీకరించరు. రాత్రి,పగలుకూడ ద్రవ్యమును ఉపాసించెదరు. అసురపురుషుల

వాక్యములనే ప్రమాణముగా గ్రహింతురు. ఇది అంతయు పురాణ ములయందలి భవిష్యద్వాణి:—

*గతా గీతా నాశం క్వాచిదపి పురాణం వ్యాపగతం*
*విలీనాః స్మృత్యర్థాః నిగమనిచయో దూరమగమత్ ,*
*ఇదానీం రైదాస ప్రభృతివచనైర్మోక్షపదవీం*
*తదేవం జానీమో కలియుగః తవైవైష మహిమా ॥*

"గీత నశించినది. పురాణములు పోయినవి. స్మృతులు అడుగంటినవి. వేదములు అంతరించినవి. ఇప్పుడు ధనదాసుల వాక్యములే మోక్షదాయకములు. ఇదంతయు కలిమహిమ." కావున ధనదాసుడగు మీసద్గురువుల వాక్యములుకూడ ప్రమాణము అన్నమాట సత్యమే."

గీతమీాద వేలకొలది టీకలు వ్రాయబడినవి. అనేకస్థలములయందు ప్రవచనము జరుగును. ఇండ్లలో నిత్యపారాయణలు జరుగును. గీతాజయంతులుకూడ చేయుదురు. కాని ఆప్రకారము ఆచరించువాడు దొరుకుట ఎంతయో దుర్లభము.

ఒకగ్రామములో ఇద్దరు మిత్రులు ఉండిరి. వారిలో ఒకడు నిత్యము గీతాపారము చేసెడివాడు. తన మిత్రునికూడ గీత చదువమని చెప్పెడివాడు. కొద్ది రోజులతరువాత అతడు మిత్రునడిగెను. "గీత చదువుచున్నావా?" అతడు సమాధానము చెప్పెను. "నేను ఒకేమారు గీత చదివితిని. సారవాక్యమగు "*సర్వధర్మాన్ పరిత్యజ్య*" "అన్నిధర్మములనువిడనాడుము"అనునదిసూత్రముగాగ్రహించితిని."

ఇప్పుడు మీాలో చాలమంది ఈమాటనే సూత్రరూపముగ గ్రహింతురు. దైవసంపదను త్యజించి అసురసంపదను స్వీకరించెదరు.

త్యజింబకభాయి :- "*అపరిగ్రహః,*" "*సమలోష్టాశ్మకాఞ్చనః, యోగక్షేమం వహామ్యహమ్*" అనిగీతలో చెప్పినమాటలు గృహస్థులు

ఎవరైన ఆచరించగలరేమోకాని "అనికేతః" ఇల్లు లేకుండ ఉండుము అనుదానిని ఎట్లు అనుసరించగలరు? గృహస్థునకు గృహము కావలెను కదా!

స్వా. ప్రి.:— "అనుదరా దేవదత్తకన్యా" అనుమాటకు అర్థము దేవదత్తుని కుమార్తె అసలు కడుపు లేనిదని అర్థము కాదు. చిన్నకడుపు కలదని అర్థము. అటులనే "అనికేతః" అనినంతమాత్రమున ఇల్లు ఉండరాదని అనుకొనుటకంటె చిన్నఇల్లు ఉండవలెను అని తెలిసికొనుట మంచిది. వసిష్ఠాదిమహర్షులుకూడ చిన్న కుటీరములలో నివసించెడివారు.

తుకారాము తన అభంగమునందు ఇట్లు చెప్పెను:—

"నేను బలమైన గృహమును నిర్మించుకొన్నాను. ఈఇంటికినిర్మాణ సామగ్రి ఖరీదైన రేకువగైరా కలప కాదు. కేవలము తాటాకు, పై కట్టడములకు పనికిరానిది. మా ధనధాన్యములను నేను నాయింట నుంచుకొనలేదు. ప్రజల ఇంట నిలువచేసికొన్నాను. కావున అడిగి కొని తెచ్చుకొనుచున్నాను. ఆస్తిపాస్తులు ఉన్నచో రక్షించుకొన వలసివచ్చును. కావున అట్టిబెడద ఏమియు ఉంచుకొనలేదు. నాకు ఏవిషయమునందును విచారములేదు. నిశ్చింతగానున్నాను. నేను బీద వాడనే. కాని నామనస్సు చాల అదృష్టవంతురాలు. దొంగలకు నా ఇంటికి రావాలనే కోరికకూడ ఉండదు. బయటకు వెళ్ళినప్పుడు ఇంటి తలుపు తీసిఉన్నదా, వేసియున్నదా అను చింతయే ఉండదు. కాప లావానిపని కుక్కలే చేయును. నా ఆస్తి మట్టికుండ, గోమయము. వాని సహాయముతో ఇల్లు, తులసివనము అలికి శుభ్రముగా ఉంచు కొన్నాను. గిన్నెలు, చెంబులు మొదలైన సాధనసామగ్రి నేను ఉంచు కోలేదు. మకోవలసిన అవసరము లేదు. వాటితో వ్యర్థముగా ద్దలుకొట్టుకొనుము?

భగవానుడు అనేకవిషయములలో నన్ను నిశ్చింతగా ఉండని చ్చెను. మా విషయవాసనను నిర్మూలముచేసెను. ఇక మా యోగ క్షేమములన్నియు ఆయనవే. నాకుటుంబమునకుకూడ ఆయనే ఆధారము. అందుచే పొందవలసిన సంపదను, అధికారమును పొందుటకు ప్రయత్నించెదను.”

ఇట్టి మహాపురుషులు దైవసంపత్తి కలవారు. ఇప్పుడు అందరు విలాసజీవితము గడపువారే. ఆచరణలేనిదే స్వరూపసాక్షాత్కారము లభ్యముకాదు.

## గీతయందు ఉపదేశించిన అసుర, రాక్షస ప్రకృతులు.

స్వా. ని॥ :—ఇతరమైన ఆచరణము ఉన్నను, లేకపోయినను జిజ్ఞాసువులు అడిగిన సమాధానము చెప్పుట మనధర్మము.

స్వా. ప్ర॥ :—స్వరూపసాక్షాత్కారమునకు మొదట రాక్షస ప్రవృత్తిని, తరువాత అసురప్రవృత్తిని విడనాడి దైవసంపదను సంపాదించి పరమాత్ముని భజింపవలెను. రాక్షస, అసుర ప్రకృతులు నివృత్తిని చెందునంతవరకు దైవప్రకృతి లభ్యముకాదు.

గీత చెప్పుచున్నది:—

మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః।
రాక్షసీ మాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః॥

“నిరర్థకమైన ఆశయు, నిరర్థకమైన కర్మలును, నిరర్థకమైన జ్ఞానమును కలిగిన వివేకహీనులగు జనులు మోహాధారమైన రాక్షస, అసుర ప్రకృతులతో నుందురు.”

విచేతసః—ఆత్మానాత్మవివేకము లేనివారు. ఉదాహరణకు ఉపనిషత్తులలోని ఇంద్రవిరోచనోపాఖ్యానమున విరోచనః ఆత్మానాత్మవివేకము చేయలేనివాడు,

మోఘజ్ఞానా:—ఈశ్వరప్రతిపాదన చేయడు. చార్వాకమతావలంబి. స్వర్గనరకములు, బంధమోక్షములు, ఈశ్వరకృతములగు వేదములు నమ్మడు. ఇట్టి అసురప్రకృతికలవారిని వర్ణించుచు గీతలో 16వ అధ్యాయమున భగవానుడు చెప్పెను.

## అసురసంపత్తికల లోకము

*అసత్య మప్రతిష్ఠం జగదాహురనీశ్వరమ్।*
*అపరస్పరసంభూతం కిమన్యత్ కామహైతుకమ్॥*

అసురసంపత్తికలవాడు జగత్తు అసత్యమని తలచును. అనగా వేదశాస్త్రములు అసత్యము లనును. అంతియె కాదు. జగత్తుయొక్క సంచాలనమునకు కారకమైన ధర్మమును అంగీకరించడు. దేవుడు జగత్కర్త అనియును, నియంత అనియును అంగీకరించడు. జగత్తు కేవలము విషయసుఖాపేక్షారూపమగు కామప్రేరితమనియు, స్త్రీపురుషసంయోగముచే ఉత్పన్నమైనదనియును తలచును. ఈజ్ఞానము మానవునకు సత్యవస్తుప్రాప్తి కలిగించదు. ఈవిపరీతజ్ఞానము వ్యర్థము.

చార్వాకమతానుయాయులగు నాస్తికులు విషయపదార్థభోగముచే ఉద్భవించిన సుఖమే సత్యమనియు, బ్రహ్మసుఖము పుక్కిటిపురాణమనియు నమ్మెదరు. విషయసుఖములచే కోరికలను పూరించుకొనుటయే వారి ప్రధానపురుషార్థము. ఈ అభిప్రాయముతో వారు వివిధవిలాసములయందు తత్పరులగుదురు. అంతియే కాదు. కొందరు విద్వాంసులు స్త్రీపురుషసంయోగముచే సృష్టికలిగినట్లుగనే మాయాబ్రహ్మసంయోగముచే జగత్తు పుట్టినది అనెదరు. కాని స్వర్గనరకములు, బంధమోక్షములు, పుణ్యాపాపములు పునర్జన్మము—వీటిని వారు నమ్మరు. ఇవి అన్నియు ఋషులు అదుపులోనుంచుటకు వ్రాసినవి అని తలచి తినుచు, త్రాగుచు, విలాసములను అనుభవించుచు అవియే సత్యములని అంతరంగమున విశ్వసింతురు. అనేకములగు ఆశలను కలిగియుందురు. వీరు ప్రచ్ఛన్నచార్వాకులు.

మోఘాశాః—ఈ చార్వాకులకు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధము లనబడు పంచవిషయపదార్థములయందును ఆశ కలుగును. వందలకొలది ఆశాపాశములచే బద్ధులయి ఉందురు.

*ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః।*
*ఈహన్తే కామభోగార్థమన్యాయేనార్థసంచయాన్॥*

"వందలకొలది ఆశాపాశములచే కట్టబడి, కామక్రోధపరాయణులయి, విషయభోగములకై అన్యాయముగా, ధనమును సంపాదించెదరు."

ఆశలు నిరర్థకములు. ఏలనన,విషయాదుల మాయాసుఖములు క్షణికములు. ఆభాసమాత్రములు. ఎండమావులవంటివి. మృగము మృగతృష్ణయందలి నీటికి భ్రాంతిచే పరుగెత్తి ఎంతయో శ్రమపడి, ఆస్థలమునకు చేరిన వెనుక నీరుకానక నిరాశచెంది తిరిగి వచ్చినట్లు అసురప్రకృతికలవారు మాయికసుఖమును కోరి విషయములయందు ప్రవర్తించెదరు. కాని అక్కడ తృప్తికలుగదు. కావుననే భగవానుడు ఆశలు నిరర్థకములు అని చెప్పెను.

మోఘకర్మాణః:—పైన వివరించిన నిరర్థకములగు ఆశలచే ప్రేరేపింపబడి చేసిన కర్మలు నిరర్థకములు. జనులు భోగవిలాసముల యందు మాత్రమే నిమగ్నులగుదురు. అదియే వారి ధ్యేయము. అందుకు ముఖ్యసాధనము ద్రవ్యము. కావున అన్యాయముగా, చౌర్యము మొదలగు ఉగ్రకృత్యములద్వారా ధనము సంపాదింప దలచెదరు.

*ఏతాం దృష్టిమవష్టభ్య నష్టాత్మానోఽల్పబుద్ధయః।*
*ప్రభవన్త్యుగ్రకర్మాణః క్షయాయ జగతోఽహితాః॥*

"ఈతలక్రిందు ఆలోచనలలో పడి అహితమును చేయునట్టి వారును, ఉగ్రకర్ములును, అల్పబుద్ధులును అగువారు ఆత్మజ్ఞానహీనులయి ప్రపంచ వినాశమునకు దారితీయుదురు."

ఈ అసురసిద్ధాంతమునే అవలంబించి బుద్ధిహీనుడు "శరీరమే నేను, శరీరాతిరిక్తమగు ఆత్మ లేదు" అని తలచి ఎల్లప్పుడును భోగ లాలసు డగును. భోగానుభవమునకు అన్యాయముగా- అనగా వ్యాపారములో మోసముచేసి, ఉద్యోగములో లంచము తీసికొని, దొంగసాక్ష్యములు చెప్పి, దొంగవ్రాతలు సృష్టించి, ఇతరుల ఇల్లు, భూమి, ధనము అపహరించును. ఇతరుల ధనమును అపహరించుట అనగా వారి ప్రాణములను తీయుటయే.

*విత్తమేవ మతం సూత్రే ప్రాణాః బాహ్యాః శరీరిణామ్ ,*
*తస్యాపహారమాత్రేణ స్యుస్తే ప్రాగేవ ఘాతితాః॥*

"సూత్రములయందు (జైనసూత్రములయందు) ద్రవ్యమే శరీరధారుల ప్రాణమని అంగీకరించబడి ఉన్నది. ద్రవ్యాపహారణము లచే వారిప్రాణములు తీసివేయుటయే జరుగును." ఇది గృహస్థుల విషయములో చెప్ప బడినది.

ఇక సన్యాసుల విషయములో వారి దంభమును గ్రహించ వచ్చును.

గీత 16వ అధ్యాయమున ఆసురసంపత్తిని వర్ణించుచు 'దమ్భో ధర్పోఽభిమానశ్చ' అని మొదట దంభమును పేర్కొనిరి.

ప్రబోధచంద్రోదయమందు ఇట్లున్నది :—

మహామోహుడు, వివేకుడు అను ఇరువురు రాజులు ఉండిరి. కాశీలో వివేకుని ప్రతిష్ఠ పెరుగుచుండెను. ఆతడు ప్రతితీర్థమునకు శమదమాదులను పంపి ప్రబోధము చేయుచుండెను. ఇదిచూచి మహా మోహుడు తనరోజులు దగ్గరపడినవని అనుకొనెను. అంతట ఆతడు దంభుడు, అహంకారుడు అను సర్దారులను కాశీకి పంపెను. దంభుడు వెళ్లినతరువాత అహంకారుడు నెమ్మదిగా తిరుగుచు, తిరుగుచు ఒక

ఇంటిని చేరెను. అక్కడ అగ్నిహోత్రసామగ్రి కనబ్బట్టెను. హోమ ధూమము బయలు వెడలుచుండెను.

ఈ ఇంట ఒకటి రెండు రోజులు ఉండిన బాగుండుననని అహంకారుడు అనుకొనెను. ఆ గృహప్రాంగణమున కొంచెము లోనికి వెళ్ళెను. అక్కడ దంభుడు, సర్వాంగములయందును గోపీచందనమును, దర్భలను ధరించియుండెను. అతనిని గాంచి అహంకారుడు "కళ్యాణమగు గాక" అని ఆశీర్వదించెను. దంభుడు "ఉః" అని ఆగెను. ఇంతలో అతని శిష్యుడు ఇట్లు పలికెను.

"మహాత్మా! ఈ ఆశ్రమములోనికి పాదప్రక్షాళనము చేసికొని ప్రవేశించవలెను."

అహం:—ఇది చాల కటికి దేశము. అతిథికి సత్కారము లేదు.

శిష్య:—పూజ్యపాదుల ఆజ్ఞ. తమ జాతి నూకు తెలియదు.

అహం:— మహాపవిత్రనగరమున మహాపవిత్రవంశోద్భూతుడైన సర్వోత్తమపవిత్రనామధారి మా పితృపాదులు.

శిష్య:— తమరు పెద్దవారే అయినను కాళ్ళు కడిగికొని ప్రవేశించుడు. అహంకారుడు కాళ్లు కడిగికొని ముందుకు నడిచెను. అంతట దంభుడు పండ్లు పటపట కొరుకుచు ఇట్లనెను.

"దూరముగా నిలబడుము. నీశరీరమును స్పృశించిన స్వేదజల బిందువులు గాలికి నామీద పడుచున్నవి; నన్ను అపవిత్రము చేయుచున్నవి."

అహం:— ఎంత గొప్ప చమత్కారయుక్తమైన ఆచారము.

శిష్య:— మహారాజులు మా పూజ్యపాదులగు గురువరేణ్యుల దర్శనమునకు వచ్చెదరు. వారుకూడ గురువర్యుల పాదములను స్పృశించుటకు అనర్హులు. కావున తమ కిరీటములను చేతియందుంచుకొని వాటి మాణిక్యకిరణముల ప్రకాశముచే సద్గురువుల చరణములకు హారతి నిత్తురు.

అహం:- (తనలో) చాల దాంభికుని వలె ఉన్నాడే. ఈ ఆసన ముపై కూర్చొనెదను.

ఇట్లనుకొని ప్రక్కనే ఉన్న ఉన్నతాసనముపై కూర్చొన బోయెను. అంతట శిష్యుడు వారించుచు ఇట్లనెను.

"అరే,అదేమి? ఇది పూజ్యపాదులగు గురుశ్రీవారి ఆసనము. దానిపై కూర్చొను అధికారము ఎవరికిని లేదు.

అహం:- ఓరి పాపీ! నావంటి దక్షిణదేశమునకూడ ప్రసిద్ధిచెం దిన పవిత్రవంశోద్భూతునకు కూడ ఈ ఆసనముపై కూర్చొను అధికా రము లేదా! విను. నేను సోమయాజి కుమార్తెను పరిణయ మాడితిని. కావున నా తండ్రికంటె గొప్పవాడను. అంతియే కాదు. నాబావ మరది మిత్రునికూతురుపై నింద మోపబడినది. కావున, నరుసవారిన నాభార్యపైకూడ నింద మోపబడునేమో అని తలచి ఆమెను త్యజించి తిని. అంత పవిత్రుడను.

దంభు:-నిజమే కావచ్చును. నేను స్వర్గములో బ్రహ్మదేవుని చెంతకు వెళ్ళితిని. అక్కడ మహాత్ములందరు నన్ను చూచి తమ ఆసన ములను విడచి చేతులు జోడించి లేచి నిలబడిరి. అక్కడ నాకు తగిన ఆసనము లేనందున బ్రహ్మగారు తన అంకమును (ఒడిని) గోమయ ముచే పరిశుద్ధము గావించి ఎంతయో మర్యాదతో నన్ను దానిపై కూర్చుండబెట్టెను. ఇట్లు దేవతలే నన్ను పెద్ద పవిత్రునిగా తలచి గౌరవింతురు. ఇతరుల సంగతి ఏమి చెప్పవలెను?

అహం :—ఓరీ! ఋషులసంగతి నావద్దనా చెప్పుట. ఋషుల ఉత్పత్తి విను. వ్యాసుడు పల్లెపడుచుకు పుట్టెను. అగస్త్యుడు మట్టి కుండ కొడుకు. లేడికి శృంగిఋషి పుట్టెను. ఇటులనే ఋషులందరి ఉత్పత్తియు నింద్యము. వారిని నా ఎదుటనా స్తుతించుట?

దంభు:—ఓహూ! మాతాత అహంకారుడే ఇతడు అని తెలిసి కొని (సంతోషముతో) నేను లోభుని పుత్రుడను. దంభుడను. నానమస్కారము స్వీకరింపుడు తాతగారూ!

అహం:—దీర్ఘాయుష్మాన్ భవ. నేను నిన్ను గుర్తించలేదు. నీకుమారుడు అసత్యుడు ఏలాగుఉన్నాడు?

దంభు:—సుఖముగా నున్నాడు. వాడు లేనిదే నాకు క్షణమైన గడువదు.

అహం:—నీతల్లిదండ్రులు తృష్ణ, లోభులు సుఖముగాఉన్నారా?

దంభు:—వారు లేనిదే నాకేమియు తోచదు. సంతోషంగా కాలము గడుపుచున్నారు.

పైసంభాషణ తాత్పర్యమేమన అసత్యము, తృష్ణ, లోభము ఇత్యాది అసురగుణములు దంభముతో అవినాభావసంబంధము కలిగి ఉండును.

ఈ తీర్థములయందును, ఆశ్రమాది ధర్మస్థలములయందును, కనిపించువారిలో చాలమంది దాంభికులు. ప్రజలనుండి ధనముసప్రేట్లు కొల్లకొట్టుదుమా అని ఆలోచించువారే. వారినిగురించి ప్రబోధచంద్రోదయమున ఇట్లు ఉన్నది.

*గఙ్గాతీరతరఙ్గశీతలశిలావిన్యస్తభాస్వద్బృసీ*
*సంవిష్టాః కుశముష్టిమణ్డితమహాదణ్డాః కరణ్డోజ్జ్వలాః।*
*పర్యాయగ్రథితాక్షసూత్రవలయప్రత్యేకబీజగ్రహ*
*వ్యగ్రాగ్రాఙ్గులయో హరన్తి ధనినాం విత్తాన్యహో దామ్భికాః॥*

"గంగాతీరమున, జలతరంగ శీతలములగు శిలలపై పరచబడిన దర్భాసనములపై కూర్చొని దర్భముడులతో శోభించు దండములతోను, ఉజ్జ్వలకమండలములతోను రుద్రాక్షమాలయందలి పూస

లను వ్రేళ్ళతో త్రిప్పుచున్న దాంభికులు ధనికుల ధనమును అపహ రించుచున్నారు. ఎంత విచారకరము!

ఇటులనే మరికొందరు స్థిరజీవితమును పొంది అనగా మఠాదు లను సంపాదించి చాతుర్మాస్యలకాలమున ఒకేచోట ఉండుచు మిగి లిన రోజులలో దేశదేశాంతరములను సంచారముచేసి ద్రవ్యమును ఆర్జింతురు.

ధనాహారార్జనే యుక్తాః దామ్భికా వేషధారిణః।
భ్రమన్తి జ్ఞానివల్లోకే భ్రామయన్తి జనానపి॥

"ధనమును, ఆహారపదార్థములను సంపాదింపదలచిన కపట వేషధారులగు దాంభికులు జ్ఞానులువలె ప్రపంచమున సంచరించి ఇత రులను మోసముచేయుదురు."

వీరు నలుగురు అయిదుగురు ఒక్కొక్కగుంపుగా చేరి సిద్ధు లును, సాధువులును అయి శిష్యసంచారములు చేయుదురు. ప్రజలకు నమ్మకము కలుగుటకు వీరు ఇట్లు చెప్పుదురు— "సద్గురువులు సిద్ధులు. పూర్ణత్వమును పొందిరి. శ్రీవారి చమత్కారములు అనంతములు. మానవుల కోరికలు అన్నియు ఈడేరును. ధనము కావలసినవారికి ధనము వచ్చును. సంతానము కావలసినవారికి సంతానము కలుగును. ఈరోజులలో గురుత్వమునకు తగిన ఇటువంటి సిద్ధులు మరియొకరు లేరు. ఎంతో పుణ్యాత్ములే ఇట్టి సిద్ధిసంపన్నులును, సమర్థులును అగు గురువులవారిని పొందగలరు."

ఇది విని ఎవరైన భిక్షకు ఆహ్వానమునిచ్చిన, శిష్యకోటి ఇట్లనును:—

"భోజనమునకు పలురకముల పిండివంటలును ఫలానావిధ ముగా చేయవలెను. గురువుగారికి ఇన్ని రూపాయలు కానుకగా నీయ వలెను. ఇట్లు గురువుగారి పూజ చేయించిన ప్రజలకు గురుమంత్ర స్వీకారము లభించును. ఈవిధముగా వారు ప్రజలను మోసపుచ్చు

దురు. "భ్రామయన్తి జనానపి" జన్మమరణాత్మకమైన ప్రపంచములో వారిని త్రిప్పుదురు. ఈవిషయమున అంధగోలాంగూల న్యాయమును దృష్టాంతముగా గ్రహించవచ్చును:—

ఒక రాజకుమారుడు ఒంటరిగా తిరుగుచు నగరము వెలుపలకు వెళ్ళెను. అతనిని కొందరు చోరులు చూచిరి. వారు ఇతనిని అరణ్యములోనికి తీసికొనివెళ్ళి ఆభరణములన్నియు తీసికొనిరి. రాజకుమారుని అటులనే వదలినచో ఎప్పుడో ఒకప్పుడు తమను పట్టించివేయును అని అనుకొని వారు అతని రెండుకండ్లను పీకివేసిరి. అంతట రాజకుమారు డిట్లనెను. "మీరు నా కండ్లు రెండును పోగొట్టిరి. ఇక నేను రాజధానికి వెళ్ళలేను. దయతో నన్ను రాజధానికి చేర్చినచో ఎంతయో ఉపకారము చేసినట్లు తలచెదను." ఇంతలో ఆదొంగలకు ఒక ఆబోతు మేయుచు కన్పడెను. వారు ఆ ఆబోతును పట్టుకొని తీసికొనివచ్చి దానితోకను రాకుమారునికి అందించి ఇట్లనిరి. "దీనిని విడువకుము, నిన్ను రాజధాని చేర్చును." రాకుమారుడు దొంగలు చెప్పినట్లు ఆబోతుతోక పట్టుకొనెను. ఆబోతు ఉరకలు వేయుచు పరుగిడెను. రాకుమారుని శరీరము కుమిలిపోయెను. అయినను ఆతడు ఆ ఆబోతుతోకను విడనాడలేదు. అతని శరీరము రక్తసిక్తమయ్యెను. చివరకు ఒక కందకములో పడి రాకుమారుడు మరణించెను.

కపటవేషధారులగు దాంభికులు ఏదియో ఒక మాయోపాయముచే ఆ దొంగలవలె జనుల ధనము, మనస్సు, శరీరమును హరించెదరు. పైగా, వారికి శాస్త్రజ్ఞానము కలుగనీయరు. చోరులు రాజకుమారునికి ఆబోతుతోక ఇచ్చినట్లు తమ గురుమంత్రమును ప్రసాదించెదరు. ఆ రాజకుమారుడు కందకములో పడి ప్రాణములను కోల్పోయినట్లుగనే జనులు మూఢతోవపట్టి జన్మమరణాత్మకమగు ప్రపంచమున తిరుగుచుందురు.

తుకారాము అభంగునందు ఇట్లు చెప్పెను.

"కొందరు గురువులు జనులను శిష్యులనుగా చేయుటకు, లాభ సాటి బేరముపై పనిచేయుటకు మధ్యవర్తులను ఉంచుకొనెదరు. వారి ద్వారా శిష్యులను ఆకర్షించెదరు. వారికి గురుమంత్రమును, గురూప దేశమును చేయుదురు. ఇట్లు కడుపునింపుకొనువారిద్వారా భగవానుడు ఎట్లు లభించును? ఇట్టి గురువులు అజ్ఞానులగు మానవులను తమ శబ్దజాలముతో బంధించి "వార్షికములను" ఏర్పాటు చేసుకొనెదరు. వారిచే వార్షికము లిచ్చుటను అంగీకరింపజేయుదురు. వీరు తమ మాటలను అనుసరించి నడచుకొనరు. అట్టివీరి ఆచరణము తమో గుణ ప్రధానము.

కొందరు సన్యాసము పుచ్చుకొని కాషాయాంబరంబులను ధరించెదరు. కాని, మనస్సునందు నాటుకొనిఉన్న విషయవాసనలను నిర్మూలము చేయరు. వారికి సామాన్యాహారము ఇష్టముగా నుండదు. మధురాన్నములే రుచించును. ఎవరు గౌరవించెదరా, ఎవరు పూజించెదరా అని నిరీక్షించెదరు. వీరు పైకిమాత్రము నారాయణనామస్మరణము చేయుదురు. ఇట్టి ఆచరణ కలవారికి జనార్దనుడు ఎట్లు కనుపించును?

కొందరు స్వాములు పొడుగుపాటి జడలు ధరించి, కచ్చ బిగించి, తమ సాధుత్వమును గర్వముతో ప్రకటించుకొనుచు నూర్లాడెదరు. శరీరము విభూతితో నిండియుండును. కాని, పిండివంటలు వండి ఎవరు భోజనమునకు బిలిచెదరా అని ఎదురు చూచుచుందురు. వారికి స్వధర్మము అనునది ఉండదు, కాని వారిమాటల చమత్కారములో పడి ప్రజలు పాడగుదురు."

స్వా॥ ని॥ :—ఈసందర్భమున దాంభికగురువునుగూర్చి ఒక దృష్టాంతము వినుడు :— శ్రీరామచంద్రుడు అయోధ్యాత్యాగము

చేసినప్పుడు అయోధ్యావాసుల నందరిని పుష్పకవిమానములో కూర్చుండబెట్టి తన ధామమునకు చేర్చుచుండెను. ఆసమయమున ఒక పుచ్చుకుక్క శత్రుఘ్నునితో నిట్లనెను. "రామచంద్రులవారితో చెప్పి నన్ను కూడ ఈవిమానములో పంపుడు." శత్రుఘ్నుడు రామచంద్రునిచెంతకు వచ్చి ఇట్లు చెప్పెను. "ఒక పుచ్చుకుక్కకూడ వచ్చుటకు ప్రార్థించుచున్నది." రామచంద్రభగవానుడు ఇట్లనెను. "ఆదుఃఖములో నున్నదానిని మొదట్నే తీసికొనివెళ్ళవలెను."ఇట్లని ఆకుక్కను ప్రశ్నించెను. "నీకు ఈదుస్థితి ఎట్లు కలిగినది?"

కుక్కకు మాట్లాడు శక్తి యుండెను. కావున అది చెప్పెను:- "భగవానుడా! నేను పూర్వజన్మములో సన్యాసిని. అనేకమందిని శిష్యులను చేసికొని వారికి అధర్మమును ధర్మముగా నుపదేశించితిని. శాస్త్రమున అపరిగ్రహనియమము కలదు. దానికి నేను ఇట్లు అర్థము చెప్పెడివాడను.

"అహం మమేత్యయం బన్ధో, నాహం మమేతి ముక్తతా," (అష్టావక్రవచనము) "అహం, మమ" "నేను, నాది" అనువాడు బద్ధుడు. అట్లు అననివాడు ముక్తుడు. కావున దేహమునందు "అహం" బుద్ధిని విడనాడి అష్టవిధభోగములను అనుభవించినను తప్పులేదు. మమకారరహితుడవై గృహము, భూమి, ధనము మొదలగువాని పరిగ్రహము చేసినను దోషములేదు. అంతియే కాదు. నేను ఇవ్విధముగాకూడ చెప్పెడివాడను. "దేవుడు మాయను సృష్టించెను. కావున మాయాజన్యపదార్థములను తిరస్కరించుట దేవుని తిరస్కరించుటయే. దేవుడు పుట్టించిన భోగములను అనుభవించుటలో దోషములేదు." ఇట్లు ప్రజలకు తలక్రిందుగా నచ్చచెప్పి, నా ఇష్టమువచ్చినట్లు సంచరించి, జనులు సంచరించునట్లు చేసితిని. కావున నాకు కుక్కజన్మము కలిగినది. నా శిష్యులు పురుగుజన్మమును పొంది నా శరీరమును తిని వేయుచున్నారు. ఇది నాకును, నా శిష్యులకును కలిగిన దుర్గతి.

## అసుర సంపద.

స్వా॥ ప్రి॥:—ఈవిధముగా బ్రహ్మసుఖము అభూతకల్పన అని తలచి, ప్రత్యక్షమగు విషయసుఖమే సత్యమని తలచి ద్రవ్యముల యందు లోభబుద్ధిని కల అసురసంపదకల జనుడు పరలోకజ్ఞానమును పొందడు. మాటిమాటికిని యమపాశముచే బద్ధుడగును. ఈవిషయమున యముడు నచికేతునకు ఇట్లు చెప్పెను:—

*న సాంపరాయః ప్రతిభాతి బాలం ప్రమాద్యన్తం విత్తమోహేన మూఢమ్।*
*అయం లోకో నాస్తి పర ఇతి మానీ పునఃపునర్వశమాపద్యతే మే॥*

"అవివేకియు, ప్రమత్తుడునైన ద్రవ్యలోభము కలమూఢునకు పరలోకజ్ఞానము కలుగదు. "ఇది ఒకటే లోకము. మరియొకటిలేదు" అనువాడు నాచేతిలో చిక్కుపడును. అనగా రోజురోజుకు నీచజన్మమును పొంది దుఃఖించును."

ఇట్లు వారి కర్మములు అన్నియు వ్యర్థములు అని స్పష్టము. యముడు ఈ శ్రుతియందు "బాల" శబ్దమును ప్రయోగించెను. "అజ్ఞో భవతి వై బాలః" అని మనువు చెప్పెను. అనగా వస్తువును వస్తురూపమున గ్రహించనివాడు బాలుడు.

ఇట్లు చార్వాకమతస్థులు స్వర్గసుఖమును, మోక్షసుఖమును పుక్కిటిపురాణమనియు, ఈలోకమందలి ప్రత్యక్షసుఖము సత్యమనియు తలచి విషయలంపటు లగుదురు. క్రౌర్యముతో విషయ పదార్థములను పొందుటకు ద్రవ్యోపార్జన చేయుదురు. కావుననే "మోఘకర్మాణః" అనిచెప్పబడినది.

## గీతయందు చెప్పబడిన అసుర, రాక్షస ప్రకృతులు.

*రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః।*

"జనులు మోహకారకములగు రాక్షస, అసుర ప్రకృతులను పొందెదరు." రాక్షసులు హింసాపరులు ద్వేషపూర్ణులు. రాక్షసులు

ఇతరులను, కాయిక, వాచిక, మానసిక ద్వేషములతో బాధించు చుండెడివారు; తిట్టెడివారు; కొట్టెడివారు. ప్రాచీనకాలపు కంస, జరాసంధాది క్రూరరాజులు మూర్తీభవించిన రాక్షసప్రకృతులు.

అసురులు రాగపూర్ణులు. విషయలాలసులు. అసురసంపదకల జనుల లక్షణము. "అసుషు రమతే ఇతి అసురః" అని చెప్పబడినది. ఇంద్రియసుఖములయందు వేడుక కలవారు అసురులు. పంచేంద్రియ విషయపదార్థములయందును రాగబుద్ధి కలిగియుండుట అసురప్రకృతికి లక్షణము. పూర్వకాలమున యయాతి అనురాజు ఎన్నిసంవత్సరములు విలాసజీవితము గడపినను అతనికి తృప్తి కలుగలేదు.

రాక్షస, అసుర ప్రకృతుల విషయమున "శ్రీవంశీధరమిశ్ర" గారు తన సాంఖ్యటీకయందు ఇట్లు వ్రాసిరి.

రాక్షసప్రకృతి అనగా ద్వేషము. అందు క్రోధము, ఈర్ష్య, అసూయ, ద్రోహము, హింస, అమర్షము, అవమానము అను గుణములు ఉండును.

1. క్రోధము:—ఏదో ఒక ప్రత్యేకదోషముచే మనసు వ్యథ చెందును. పండ్లు పటపట కొరుకును. కండ్లు ఎర్రగా జేయును. క్రోధమున తనను మరచిపోయి, పశువువలె ఇతరులపై ఆక్రమించుటయును, నోటికి వచ్చినట్లు తప్పుడుకూతలు కూయుటయును చేయును.

2. ఈర్ష్య:— దాయాదివిభాగ సందర్భములలో భాగస్వాములమధ్య జన్మించిన పరస్పర ద్వేషము.

3. అసూయ:—ఇతరుల సుగుణములను, అభివృద్ధిని సహించలేకపోవుట.

4. ద్రోహము:—ద్వేషముచే ఇతరులను నశింపజేయవలెనను కోరిక.

5. హింస:—ఇతరులను బాధించుట. ద్రోహముచే హింస జన్మించును.

6. అమర్షము:—అశక్తుడును, అసమర్థుడును అగు మానవుని యందు అతడు చేసిన తప్పునుగురించి సమర్థుడు పొందు ద్వేషము.

7. అవమానము:—ఏకొంచెము అపకారము ఇతరుడు చేసినను, దానిగురించి మనస్సులో ఎక్కువ బాధనుపొంది ద్వేషమునకు తావు ఇచ్చుట.

అసురప్రకృతి అనగా రాగము. అందు కామము, మాత్సర్యము, వాంఛ, ఆశ, లోభము, మాయ, దంభము ఉండును.

1. కామము:—రమించవలెనను కోరిక.

2. మత్సరము:—తనకు ఏమియు ఉపయోగము లేనందున ఇతరుల అభిప్రాయములను నిరాకరించుట, ఇతరుల గుణములను గుణములుగా తలచకపోవుట.

3. వాంఛ:- ధర్మమునకు విరుద్ధముగా మాయాజన్యములగు ధనాదులను సంపాదించవలెనను కోరిక.

4. తృష్ణ:- "నన్ను తక్కువవానినిగా ఎవ్వరును తలచరాదు." అనుభావము. ధనము వెచ్చించవలసినచోట ఖర్చుపెట్టక నిలువచేయు పిసినిగొట్టుతనము కూడ తృష్ణలోనికి జేరును.

5. లోభము:-ధర్మమునకు విరుద్ధముగా ఇతరుల ధనమును లాగికొనవలెనను గుణము.

6. మాయ:- ఇతరులను వంచనచేసి లొంగదీయవలెనను భావము.

7. దంభము:- కపటధార్మికవేషము వేసికొని తన గొప్పతనమును వర్ణింపజేసికొనవలెననియు, ప్రసిద్ధపురుషుడు కావలెననియు కోరిక.

ప్రాచీనకాలమున ఈ రాక్షస, అసుర ప్రకృతులు క్రూరులును, విలాసపరులును అగు రాజులయందు కన్పట్టెడివి. కాని ఇప్పుడు

కొన్ని మతములు మున్నగు ధార్మిక స్థానములయందు కూడ ప్రవేశించినవి; కారణమేమన, అక్కడకూడ రాగద్వేషాదులు కన్పడవచ్చును. రాక్షసప్రకృతిపై ఈదృష్టాంతము వినుడు:—

## బైబిలులో వర్ణించిన దాంభికుడగు మతాధికారి.

బైబిలులో రాక్షసప్రకృతికల దాంభికులగు మతాధికారులు ఎట్లు ధర్మనియమములను విడనాడి, స్వార్థపు వలలో చిక్కుకొనిరో, ఎట్లు ధనమోహములో పడిరో వర్ణించబడినది.

## జీసను క్రైస్తుయొక్క ఆశ్చర్యకరమగు సామర్థ్యము.

జెరూసలేములోని మందిరములో జీసను ప్రవేశించి వడ్డీవ్యాపారము చేసినవారిని, క్రయవిక్రయములను చేయువారిని, పావురములను అమ్మువారిని ఉద్దేశించి ఇట్లు చెప్పెను:—

"దేవమందిరము ప్రార్థనాస్థలము. దానిని మీరు దొంగలు దాగికొను గుహగా మార్చిరి." అని వర్తకులు కూర్చొనుబల్లలను విసరివేసెను. పావురములను అమ్మువారిని తరిమివేసెను. వారికి బదులుగా కుంటి, గుడ్డి, చెముడు, మూగ మొదలగు అవయవవైకల్యము కలవారిని మందిరములో ప్రవేశపెట్టెను. ప్రభువును ప్రార్థించి వారి రోగములను పోగొట్టెను.

యహూదులలో పశుబలి ఆచారము. జనులు వారివారి సామర్థ్యమును అనుసరించి బలుల నొసగెడివారు. బీదలు పావురములను బలి ఇచ్చెడివారు.మతాచార్యులు పావురములను అమ్మెడివారు.

జీసనుక్రైస్తుయొక్క ఈ ఆశ్చర్యకరమగు సామర్థ్యమును చూచి మతాచార్యులు క్రోధోద్రిక్తులయిరి. రెండవరోజున జీసను ధర్మోపదేశము చేయుచుండ, ధర్మోపదేశపు అర్హతలను సూచించు అధికారపత్రము చూపించమని అతనిని వేధించిరి.

జీసను వారికి ఈవార్త చెప్పెను:—

## ధాంభికులగు మతాచార్యులకంటె నియమబద్ధమగు జీవితము గడపు బీదవాడు గొప్పవాడు.

ఒక రైతునకు ఇరువురు కుమారులు. అతడు పెద్దకుమారుని పొలము వెళ్ళుమని ఆజ్ఞాపించెను. పుత్రుడు వెళ్ళననెను. అనంతరము అతనికి పశ్చాత్తాపము కలిగి తనంతట తాను పనిలోనికి వెళ్ళెను. రైతు రెండవకుమారునికూడ అటులనే వెళ్ళుమని చెప్పెను. రెండవ కుమారుడు "వెళ్ళుచున్నాను" అని సమాధానము చెప్పెను. కాని వెళ్ళలేదు. ఇందులో తండ్రిఆజ్ఞను పాటించినవాడు ఎవడని మీారనెదరు? మతాచార్యులవద్దనుండి సమాధానము వచ్చెను. "పెద్దకుమారుడు." అంతట జీససు ఇట్లనెను. "న్యాయముగా ధనము నార్జించుకొని జీవితము గడుపునట్టి బీదవాడు మీాకంటె ముందుగా స్వర్గమునకు వెళ్లును.

అంతట మతాచార్యులకును, నాయకులకును క్రోధము కలిగెను. వారు జీససు ప్రాణములను తీయ నిశ్చయించిరి. ఇట్లు చేయవలెనన్న ప్రజలు ఏమి అనుకొనెదరో అనుభయము వారికి కలిగెను. జీససు తన అచరణముచే ప్రజల హృదయమును జయించుటయే దీనికి కారణము.

### జీససు క్రీస్తు ఉపదేశము.

మరొక సమయమున జీససు ఇట్లు చెప్పెను :—

"బాహ్యాడంబరముకొరకు మతాచార్యులు అనేక కృత్యములు చేయుచున్నారు. తాము మహాపవిత్రులమని చెప్పుకొనుటకును, ధర్మరక్షకులమని ఋజువు చేసికొనుటకును అనేక పన్నాగములను పన్నుచున్నారు. దేవుడు ఒకడే. మీారందరును సోదరులు. ప్రజలకు సేవచేసినవాడే గొప్పవాడు. స్వర్గద్వారము ప్రజలకు మూసివేసిన వాడు తుచ్ఛుడు. తాను-స్వర్గమునకు వెళ్ళలేడు. ఇతరులకు వెళ్ళ

అవకాశము ఉండనివ్వడు. దేవుని పేరిట కానుకలను తీసికొను ఆ గ్రుడ్డి నాయకులు తుచ్ఛులు. వారికి ధనముతప్ప మరేమియునక్కర లేదు. ఓ మూర్ఖులారా! ధనము గొప్పదియా, ధనమునకు పవిత్రత నిచ్చు మందిరము గొప్పదియా? న్యాయము, నియమము, దయ, శ్రద్ధ—వీనికి తావు లేకుండజేయువారు తుచ్ఛులు. బైటకు తళతళ మెరయుచున్న పాత్రలు లోపల ఎంత మురికిగానున్నవో చూడుడు. బైటికి స్వచ్ఛవస్త్రములను ధరించిన నశ్వరశరీరమును, ఎముకల పోగును కల ఆ మనుష్యులు తుచ్ఛులు. మీరు పైకి జనులచెంత నియమపరులుగా నిలబడెదరు. కాని లోపల దంభము, కపటము నిండియున్నవి. ఓ జరూసలేము! నీవు నిజమైన సాధువులను వెళ్ళగొట్టితివి. వారి పవిత్రచరణములు నీవైపు ప్రసరించుచుండగా నీవు రాళ్ళవాన వారిమీద కురిపించుచున్నావు.”

## గురుద్రోహి జూడాసు.

ఈ ఉపదేశములను విని మతాచార్యులును, నాయకులును భవనమున సమావేశమయి ఏదోవిధముగా జీససు ప్రాణములను తీయవలెనని తలచిరి. వారు జీససుయొక్క పన్నెండుగురు శిష్యులలోనుండియు జూడాసు అను శిష్యుని వెతికిరి. గురుద్రోహి అగు జూడాసు ఇట్లనెను:— నేను జీససును మీకు అప్పగించినచో మీరు నాకు ఏమి ఇచ్చెదరు? ముప్పది వెండినాణెములకు బేరమయ్యెను. జూడాసు మతాచార్యులకు చెప్పెను:—

నేను సంజ్ఞాపూర్వకముగా జీససును తెలుపుదును, మీరు పట్టుకొనుడు. జూడాసు జీససుచెంతకు వచ్చి ‘మహాప్రభూ’ అని ఆయనచేతిని ముద్దిడెను. వెంటనే మతాచార్యుల మనుజులు జీససును పట్టుకొని బైటకు తీసికొని వెళ్ళిరి. జనసమూహామునుండి ఒకరు కత్తిని బైటికి లాగెను. ఇది చూచి జీససు ఇట్లనెను. “మిత్రుడా. కత్తిని

ఒరలో నుంచుము. కత్తిని చేతపట్టినవాడు కత్తిచే చచ్చును." మతాచార్యులు జీససుకు వ్యతిరేకముగా చెప్పుటకు అబద్ధసాక్ష్యములను తయారుచేయ ప్రయత్నించిరి. కాని ఎవరును ముందుకు రాలేదు.

ప్రధానాచార్యులు అడిగెను:– దేవునిపై ఒట్టుపెట్టుకొని చెప్పుము. "నీవు దేవుని కుమారుడగు క్రీస్తువా?" జీసస్ ఇట్లు చెప్పెను. "మీరే చెప్పుచున్నారుగదా!" మతాచార్యులకు ఈ సమాధానము చాలును. వెంటనే మతాచార్యులు జీససుకు మరణ దండన విధించవలెనని నిర్ణయించిరి. మతాచార్యులు జీససును మిగతా మతాచార్యులవద్ద నిలబెట్టిరి. ఇంతలో జూడాసుకు పశ్చాత్తాపము కలిగి ముప్పది వెండినాణెములును మతాచార్యునికి తిరిగి ఇచ్చివేసెను. అతడు ఇట్లు చెప్పెను:– "నేను నిర్దోషియగు వ్యక్తిని మోసగించితిని. పాపము చేసితిని." అతనికి మతాచార్యులు ఇట్లు సమాధానము చెప్పిరి. "మాకేమి, నీసంగతి నీకు ఎరుక." జూడాసు తరువాత పశ్చాత్తప్తుడై ఆత్మహత్య చేసికొనెను.

## కొరతపై క్రీస్తు.

గవర్నరు జీససును అడిగెను:– నీవు యహూదులరాజువా?

జీసస్:— "నీవే అనుచున్నావు కదా!"

అంతట మతాచార్యులు జీససుపై నేరములను మోపిరి. జీసస్ మౌనము వహించెను. గవర్నరునకు చాల ఆశ్చర్యము కలిగెను. అతడు జనులను ఉద్దేశించి ఇట్లనెను:– "ఈ క్రీస్తు అనబడు జీససును నేను ఏమి చేయవలెను?" అంతట మతాచార్యులు ప్రజలను తమ వైపు త్రిప్పుకొనుటకు ధనము విరజిమ్మసాగిరి. అది దీసికొని ప్రజలు జవాబు చెప్పిరి. "కొరతను వేయుడు!" గవర్నరు ఇట్లనెను:– "నిర్దోషి రక్తముతో నేను దోషమును పోరకజాలను. మీ ఇష్టము వచ్చినట్లు చేయుడు." అంతట ప్రజలందరును ఇట్లనిరి—"ఆయన రక్తము మాపై

కను, నూసంతానముల పైనను పడుగాక". అనంతరము సైనికులు అత నికి పాతబట్టలుకట్టి ముండ్లకిరీటము పెట్టి "యహూదులరాజా, మోకాళ్ళమీాద కూర్చుని నమస్కారము చేయుము" అని వేళాకో ళము చేసిరి. జీససును వధస్థలమునకు తీసికొనివెళ్ళి మేకు నాటిరి. ఆ సమయమున అచ్చటనుండి వెళ్లుజనులు కొందరు ఇట్లనిరి:- "మందిర మును కూలగొట్టి మూడురోజులలో క్రొత్తది కట్టు అభిప్రాయము కల జనులారా! మీాజాతిని రక్షించుకొనుడు."

ప్రధానాచార్యులు ఇట్లు పరిహాసము చేసెను:- "ఇతరులను రక్షించకలవాడు తన జాతిని రక్షించలేడా? నీకు దేవునిమీాద నమ్మ కములేదా! నీవు దేవుని కుమారుడవైనచో దేవుడు నిన్ను ఎందుకు రక్షించుటలేదు?" ఇట్లనుచు ప్రధానాచార్యులు ఆజ్ఞాపించెను:- "ధర్మ మును రక్షించుటకు జీససును వెంటనే చంపివేయుము." అంతట జీసను శరీరము కొరతపైనుంచి చేతులు, కాళ్ళు, వక్షము- ఈ ప్రదే శములయందు మేకులు నాటబడెను. ఇది రాక్షసప్రకృతి.

## అ సు ర ప్ర కృ తి.

అసురప్రకృతిపై ఈ విరోచనోపాఖ్యానము వినుడు:—

అసురప్రకృతి అనగా, శరీరమే ఆత్మ అని విశ్వసించి భోగ విలాసములయందు తత్పరులగుట.

విరోచనుడును, ఇంద్రుడును ప్రజాపతిచెంతకు ఉపదేశమునకు వెళ్ళిరి. ప్రజాపతి వారికి ఆత్మానుభవము కలుగజేయుటకు ఇట్లనెను:- "సుందరమైన వస్త్రాదిభూషణములతో అలంకరించుకొని జలపాత్రము నందు చూడుడు." అంతటవారు అట్లు అలంకరించుకొని జలపాత్రమున అవలోకించిరి. ప్రజాపతి "ఏమి చూచుచున్నారు." అని అడిగెను. ఇట్లు అడుగుటలో ఆతని ఆశయమిది—ప్రతిబింబమున చూచునవి అన్నియు శరీరసంబంధముచేతనే వచ్చినవి. ఉదాహరణమునకు ఆ

భూషణాదులు ఆగంతుకములు. ఇటులనే కేశనఖాదులు కూడను. ఇటులనే శరీరముకూడ ఆగంతుకమే అని దాని ఆగమాపాయిత్వ మును తెలిసికొనినచో వీరికి ఆత్మానాత్మజ్ఞానము కలుగును అని. కాని, వారి ఇరువురకును ప్రజాపతి యుద్దేశ్యమునకు విరుద్ధముగా విపరీతజ్ఞానము కలిగెను. ఆ ఉపదేశమునకు ఆనందించి వారు ఇట్లనిరి. "స్వామీ! మేము ఇద్దరము అలంకారయుక్తమైన శరీరమును జలమున చూచుచున్నాము. ఈ సుందరవస్త్రాదిభూషణయుక్తమగు శరీరమే బ్రహ్మము అని తెలిసికొన్నాము. ఇది అమృతము, అభయము." ఇట్లని సంతుష్టహృదయులై వెళ్ళిపోయిరి.

ఇంద్రుడు బుద్ధిమంతుడు. ఆతడు తిన్నగా దేవతలచెంతకు వెళ్ళ లేదు. అతడు ఏకాంతమున మననము చేసెను. ప్రజాపతిచెంతకు అనేకసారులు వెళ్ళి చివరకు ఆత్మజ్ఞానమును పొందెను. విరోచనుడు జడుడు. అతడు తన స్థానానికి వెళ్ళి తన అసురప్రజానీకమునకు ఇంకను ఎక్కువ విషయభోగములను అనుభవించమని చెప్పెను. అతడు ఇంకా ఇట్లనెను.

"నేను బ్రహ్మవద్దకు వెళ్ళి ఈ ఉపదేశమును పొందితిని:—

శరీరమే ఆత్మ. "ఆత్మైవేహ మహయ్యః, ఆత్మా పరిచర్యః." "శరీరరూపమగు ఆత్మయే పూజ్యము, శరీరరూపమగు ఆత్మయే సేవ్యము. భోగవిలాసములయందు మునిగి అన్నిరకముల ఆనందము లను అనుభవించుడు. చచ్చినతరువాత ఏమియు లేదు. "ఇమం చాముం చేతి"– ఈలోకము పరలోకముగూడ మీాదియే."

పరలోకమును అంగీకరించని చార్వాకులుకూడ చనిపోయిన తరువాత శ్మశానయాత్రయందు మృతశరీరమును పల్లకీలోపెట్టి విలువ కల వస్త్రములు,పుష్పహారములు,అగరుధూపము, అత్తరులు, మొద ...గావాతి ...ను, శంకా,దుందుభి మొదలగు వాద్యములతోను ఎంతో

అట్టహాసముతో, సంగీతము,పూజ మొదలగు కార్యక్రమములతో తీసి కొని వెళ్ళెదరు. వారి స్మారకచిహ్నములుగా పెద్దపెద్ద శిలలనో, భవనములనో నిర్మించుటకూడ గౌరవమని తలచెదరు. శవమునకు వారు చూపిన గౌరవము,వైభవము పరలోకమున కలుగునని విశ్వసించెదరు.

పై ఉపదేశమును చేసిన తరువాత విరోచనుడు పెద్దపెద్ద భవనములను నిర్మించెను. అనేకరకములగు విలాసోపకరణములను అనుభవించుటకు తెప్పించెను. తాను కూర్చొనుటకు రత్నఖచితసింహాసనమును తయారుచేయించెను. వజ్రవైడూర్యములను ధరించెను. విహారమునకు వెళ్లు సమయమున సేనాధిపతులు ఆతనికి రత్నఖచితమగు పాలకి, రత్నఖచితమగు అంబారీ, ఢంకా మొదలగు వాద్యములు ఏర్పాటుచేసిరి. "మహారాజాధిరాజ, "సార్వభౌమాధిపతి" మొదలగు బిరుదములను ధరించి నౌకరులచే పిలిపించుకొనుచుండెను. ఇతరులకు కూడ తగువిధముగా రాజరత్న, రాజభూషణ మొదలగు బిరుదములను ఇచ్చెను. సంవత్సరమునందు కొన్ని ప్రత్యేకదివసములయందు అట్టహాసముతో వాహనముపై బయలువెడలి ప్రజలపూజల నందుకొనెను.

అసురులు తమకు లభించిన భోగములతో నారాంగనల నృత్యమునందును, గీతమునందును నిమగ్నులయిరి. అందరును కలిసి వనభోజనాదులు చేసికొని అనేకరకములగు రుచిగల అన్నపానముల యందు తన్మయులయిరి. అసురాధిపతియగు విరోచనుడు కలిగించిన దేహాత్మభావమును, భోగవిలాసజీవితమును, సేవలును, పూజలును గైకొను విద్యయు వంశానుక్రమముగా రాజులకు సంక్రమించినది.

వారినుండి తెలిసియు, తెలియకయు ధనవంతులలో ప్రవేశించినది. ధనవంతులు తమ శరీరపోషణమే ముఖ్యమని విలాస నిమగ్నులయిరి. కావుననే పెండ్లి మొదలగు శుభ సమయ

యందు వారవనితల నృత్యగీతములను ఏర్పాటుచేసెదరు. అనంతరము అనేకమందిని అవినీతికరములగు వాసనాపూర్ణకృత్యములకు పురిగొల్పెదరు.

ఈ అనర్థపరంపర ఇంతటితోనే ఆగలేదు. ఈమధ్య రాజులయందును, ధనవంతులయందును ఈశరీరపూజ మితిమీరిపోయినది. తీర్థములయందును, దేవస్థలములయందును, మఠములయందును, ఆశ్రమాదులయందును ఈ అనిష్టము ఎక్కువగానున్నది. గురువులు, మతాచార్యులు, సన్యాసులు, త్యాగులు సంసారసుఖములను మరిగి ఆత్మప్రాప్తికి బదులు తమ కలుషాచరణయుక్తమగు మార్గమును అమాయిక ప్రజలనెత్తిని రుద్ది వారిని వలలో చిక్కించుకొనుచున్నారు. వారియందు కూడ ఈ అసురస్వభావము ఎక్కువగానున్నది. వారు లోకులేమనుకొనెదరో అను భయముతోమాత్రము వారాంగనల నృత్యగీతాదులను సేవించరు. మిగిలిన అన్ని భోగవిలాసములకును వెనుకాడరు. ఛత్రము, చామరము, దండము, ఢంకా, దుందుభి, పాలకి, పాదుకలు ఉండును. ఏంచెప్పను? సువర్ణమును స్పృశించినంతమాత్రముననే ప్రాయశ్చిత్తము చేసికొనవలెనని యతిధర్మమున ఉండగా, సువర్ణఖచితసింహాసనముపై కూర్చొని తమశరీరమునకు ఇతర భక్తులచే పూజలు చేయించెదరు. పాదపూజలు చేయించుకొని శిష్య, ప్రశిష్యులుద్వారా ఉపదేశములను చేయించెదరు. రాజులు వాహనారూఢులై బయలువెడలినట్లు వారుకూడ వాహనారూఢులయి బయటకు వచ్చెదరు. వారు రాజులకు రాజులు. కావున వారి రాజవైభవము ఉన్నచో ఉండనిండు. కాని వారు ప్రజలను మభ్య పెట్టుటకు ఇట్లనెదరు. "ఇవి అన్నియు మా మతమునకు అందము తప్పించుటకే. మాకు ఎట్టి వైభవములును అక్కర లేదు. ఫలాన సంప్రదాయములను చూడుడు. వారు ఎంత సేవ చేయించుకొను

చున్నారో! ఎటువంటి ఊరేగింపుతో బయటకు వచ్చెదరో! నీధర్మ మేమి తక్కువైనదా? నీమతము ఆమతముకంటె గొప్పది. మీశక్తి వారి శక్తికంటె ఎక్కువ. వారు వారి గురువునకు చేసిన సేవకంటె మీరు మీగురువునకు ఎక్కువగా సేవ చేయవలెను. మహావైభవో పేతమగు ఊరేగింపు జరుపవలెను. లేనిచో మీసంప్రదాయమునకు హాని కలుగును. ఇటులనే రాజుల ఊరేగింపు జరిగినప్పుడు నగర మంతయు అలంకరించబడును. రాజమార్గములన్నియు జండాల తోడను, తోరణములతోడను ప్రకాశించుచుండును. కాష్ఠద్వార ములు తయారుచేసి అనేకవిధములగు అలంకరణములను చేయుదురు. ధనవంతులుకూడ వివాహాదులయందు ఇట్టే శృంగారములు చేయు దురు. మేము (మతగురువులు) రాజులకు రాజులము (గురువు లము). కావున మాకుకూడ ఇటులనే ప్రకాశమానమగు శృంగార ప్రసాధనములు ఉండవలెను. ఈ ఉద్దేశ్యములతో ఆచార్యులు తమ మధ్యవర్తులగు ప్రతినిధులద్వారా తమ మహాత్త్వమును వెల్లడిం చుటకు అన్నిరకములగు ఏర్పాటులను చేయించుకొనెదరు. "*యస్య దేవే పరా భక్తిర్యథా దేవే తథా గురౌ*"—దేవునియందు మిక్కుట మగు భక్తి కలవానికి దేవునియందు ఎట్టి భక్తియుండునో అట్టి భక్తియే గురువునందు కూడ ఉండును. ఈ శ్రుతివాక్యమును ఆధారముగాచూపి శిష్యుల కల్యాణార్థము తమదేహమునకు దేవ మూర్తివలె పూజలు, అర్చనలు చేయించుకొనెదరు. ఇది ధర్మ కార్యము అని గుడ్డినమ్మకముకల జనులు తలచెదరు.

ఇట్లు దేహాత్మవాదులగు జనులు శరీరమే ఆత్మ అని తలచి శరీరమనెడు ఆత్మ నశించినతరువాత పుణ్యాపాపములు, స్వర్గనరక ములు ఉండవని నమ్మి ఇష్టము వచ్చినట్లు సంచరించెదరు. ఇది అసుర ప్రకృతి. ఈ రాక్షస, అసుర ప్రకృతుల నిర్దేశము ముందుచేయుట వలన ఒక ప్రయోజనము కలదు. బట్టపైనున్న మురికి తుడిచివేయని దే

రెండవ రంగు ఎక్కనట్లు, అంతఃకరణమున ఎంతకాలమునుండియో నిలువయున్న రాక్షస, అసుర ప్రకృతుల ధర్మములగు రాగద్వేషములనెడు మలవిక్షేపదోషములు పోనంతవరకు దైవసంపద లభ్యమగుట కష్టము.

## రాక్షస, అసుర ప్రకృతుల పరంపర.

ఈ రాక్షస, అసుర ప్రకృతులలోని ఒక గుణము వచ్చినచో మిగిలిన గుణములు అన్నియు సజాతీయములగుటచే వెనువెంటనే వచ్చును.

ఒకరాజు ఒక ప్రదేశమున వేదము, మద్యము, వేశ్య ఈ మూడు వస్తువులను ఉంచి ఇట్లు ఆజ్ఞాపించెను:—

1. ఈవేదము అబద్ధము అని చెప్పవలెను. లేదా,
2. ఈమద్యమును సేవింపవలెను. లేదా,
3. ఈవేశ్యను అనుభవించవలెను.

అట్టివారికి దక్షిణ లభించును.

బ్రాహ్మణులందరును అక్కడకు వచ్చి ఆ వింత షరతులను విని వెనుకకు మరలిరి.

ఒక బీదబ్రాహ్మణుడు మద్యపానముచేసి ప్రాయశ్చిత్తము చేసికొనవచ్చును అనుకొని మద్యపానము చేసెదనని వచ్చెను. ఆ మూడు వస్తువులును ఉన్నప్రదేశమునకు వెళ్ళి మద్యపానము చేసి రమ్మని రాజు బయటకూర్చొనెను. బ్రాహ్మణుడు మద్యమును సేవించెను. అంతకంతకు మత్తెక్కి మద్యమును మిక్కుటముగ స్వీకరించెను. అనంతరము ఒడలు తెలియక వేశ్యనుకూడ అనుభవించుటకు వెళ్ళబోయెను. అంతట రాజు అతనికి "ఆపని వేదమునందు నిషేధించబడినది" అని చెప్పెను. వెంటనే బ్రాహ్మణుడు ఆ వేదములు అసత్యములు అనె

ఇటులనే ఒక నిషిద్ధపదార్థమును స్వీకరించినతరువాత మరొక నిషిద్ధపదార్థమును స్వీకరించరాదను వివేకము పోవును. నెమ్మది నెమ్మదిగా అసురసంపదలు అన్నియు ఒకదానివెంట మరియొకటి వచ్చి మనుష్యుని వశపరచుకొనును.

అంతట అందరును తమతమ నెలవులకు వెడలిరి.